క్లుప్తంగా

స్వామివారి నిత్యాన్నదానానికి రూ.50,555 విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి కానూరు గ్రామస్తులు పరుచూరి ఎస్‌వీఎల్ సాయికుమార్, ప్రియాంక దంపతులు రూ.50,555 విరాళంగా అందజేశారు. తొలుత బుధవారం ఉదయం వారు ఆలయానికి చేరుకుని స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ సత్యనారాయణకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో వేం చేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీగోదాదేవి తిరునక్షత్రం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపారు. అనంతరం శ్రీగోదాదేవి అమ్మవారికి 58 లీటర్ల గోక్షీరం, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులచే తిరుప్పావై ప్రబంధ పారాయణం, విష్ణుసహస్రనామ పారాయణం, భగవన్నామ సంకీర్తన జరిపారు. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు వీల్ చైర్స్ అందజేత



పెనమలూరు: ఫ్లోరోసిస్ నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకి తన కార్యాలయంలో బుధవారం జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా ఫ్లోరోసిస్ బాధితులకు వీల్ చైర్లు, లంబార్ బెల్టులు, నెక్ బెల్టులు, వాకర్స్‌ను పంపిణీ చేశారు. ఫ్లోరైడ్‌తో కలుషిత నీరు, ఆహార పదార్థాల్లో నల్ల ఉప్పు ఎక్కువగా వాడటం వల్ల వ్యాధి బారిన పడటానికి ఆస్కారం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నీరు, ఉప్పు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఫ్లోరోసిస్ నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంఓ మహేష్, డాక్టర్ హిమబిందు, మండల వైద్యాధికారి బిజిలి శ్రీనివాస్, జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ బద్రీనాథ్, నాయకులు అనుమోలు ప్రభాకర్‌రావు, కోయ ఆనంద్, అంగిరేకుల మురళి, నర్రా చంటి, రాంకుమార్, దేవినేని రాజా, గోపిచంద్, సంగెపు రంగారావు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు

ఉంగుటూరు: మండల కేంద్రమైన ఉంగుటూరులోని స్త్రీశక్తి భవనంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సర వార్షిక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ, ఎల్‌ఈడీ వీధి దీపాల నిర్వహణపై మూడు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే శిక్షణ తరగతులకు గ్రామ సర్పంచులు, గ్రేడ్ – 1, 5 కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

నేడు నున్నలో వైద్యశిబిరం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం ఆంజనేయస్వామి గుడి పక్కన ఉన్న (బోడపాడు) కమ్యూనిటీ హాల్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ(ఎఫ్‌ఏసీ) బీఎల్‌వీ శేషగిరిరావు, డాక్టర్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయసేవా సంస్థ, గిరిజన సేవా సంస్థల ఆధ్వర్యంలో జిల్లా వైద్య శాఖచే ఉచిత వైద్యశిబిరం జరుగుతుందన్నారు. శిబిరంలో గుండె, ఎముకలు, జనరల్ వైద్య నిపుణులు పాల్గొని ఏకో, కంటి, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

పోరంకి, కానూరులో డ్రెయినేజీల పరిశీలన

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు, పోరంకి ప్రాంతాల్లో డ్రెయినేజీలను కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. భారీ వర్షాలు కురవటంతో పోరంకి, కానూరు గ్రామాల్లో డ్రెయినేజీ సమస్య తలెత్తి మురుగు నీరు పారుతున్న సమస్య తలెత్తింది. సమాచారం తెలుసుకున్న కమిషనర్ వెంకటేశ్వరరావు పోరంకి బీజేఆర్ నగర్ ప్రాంతంలోని డ్రెయినేజీలు, కానూరు కెనడీ స్కూల్, అమరావతి రోడ్డు, ఎస్సీ ఏరియా ప్రాంతాల్లో డ్రెయినేజీలను పరిశీలించి పూడిక తీయించారు. ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటుచేసి మురుగునీరు తోడించారు. డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు.

వరినాట్లు వేళ.. సాగునీటికి కటకట

- నీళ్లు ఆపేసి కేఈ కెనాల్‌కు మరమ్మతులు
- సకాలంలో నీరు అందక ఎండుతున్న నారుమళ్లు
- ఇరిగేషన్ యంత్రాంగం తీరుతో రైతుల ఇక్కట్లు



బాపులపాడు మండలం పెరికీడు వద్ద కృష్ణా-ఏలూరు కాలువ దుస్థితి

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణా – ఏలూరు కాలువ నిర్వహణ, మరమ్మతుల విషయంలో నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం ఆయకట్టు రైతుల పాలిట శాపంగా మారుతోంది. నారు మళ్లు సిద్ధం చేసుకుని, వరినాట్లు ముమ్మరంగా సాగుతున్న ప్రస్తుత తరుణంలో అర్థాంతరంగా కాలువకు సాగు నీరు నిలిపివేయటం రైతులను విస్మయానికి గురిచేస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే కాలువ నిర్వహణను పూర్తిస్థాయిలో చేపటాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారు. వ్యవసాయ పనులు ఊపందుకున్న తరుణంలో కృష్ణా – ఏలురు కాలువ(కేఈ కెనాల్)కు నీళ్లు ఆపేసి మరీ తాయితీగా మరమ్మతులు నిర్వహించటం ఇరిగేషన్ యంత్రాంగం పనితీరుకు దర్పణం పడుతుంది.

నాట్లు వేసే వేళ నీరు నిలిపివేత

కృష్ణా, ఏలూరు జిల్లాల్లో సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు, మరో 60 గ్రామాలకు తాగునీటిని కేఈ కెనాల్ అందిస్తోంది. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందుగా ఏప్రిల్, మే నెలల్లో ప్రధాన, ఉప కాలువల నిర్వహణ, మరమ్మతులను ఇరిగేషన్ అధికారులు చేపటాల్సి ఉంది. కానీ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు కాలువను సన్నద్ధం చేయకుండా నేరుగా సాగునీరు విడుదల చేయటంతో నీళ్లు కిందకు పారని పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఏటా జూలై 15 నాటికే సాగునీరు విడుదల చేసే అధికారులు ఈ సీజన్‌లో ఆలస్యం చేయటం రైతులకు నీటి కష్టాలను తెచ్చిపెట్టింది. సుమారు 65 కిలోమీటర్లు పొడవు కలిగిన కేఈ కెనాల్‌లో కేసరపల్లి, తేలప్రోలు, ఆత్కూరు, వీరవల్లి, పెరికీడు, తోటగూడెం వద్ద దట్టంగా గుర్రపు డెక్క, తూడు, నాచు పెరుకుపోవటంతో నీటి ప్రవాహనికి అవరోధం ఏర్పడింది. దీంతో మొద్దు నిద్ర వీడిన ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు కాలువ నిండా పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, నాచు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. గత ఐదు రోజులుగా కాలువకు నీటి సరఫరా నిలిపి వేసి, ట్రాక్టర్లుతో కాలువను దమ్ము చేస్తున్నారు. అదునుకు సరిపడా సాగునీరు అందకపోవటంతో వరినారు ఎండిపోతుందని, వరినాట్లు వేసేందుకు పొలాలు దుక్కి దున్నేందుకు నీళ్లు లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా కాలువ మరమ్మతులు

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగా కేఈ కెనాల్ మరమ్మతులు, నిర్వహణ పనులను పట్టించుకోకుండా వదిలేసిన ఇరిగేషన్ అధికారులు వరినాట్లు ముమ్మరంగా సాగుతుండగా, మంచి అదునులో సాగునీరు నిలిపి వేయటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సారీ నామమాత్రంగా కాలువ నిర్వహణ, మరమ్మతులు చేయటం వల్లే ఈ దుస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. అధికారుల తీరు వల్లే కాలువలో దట్టంగా గుర్రపు డెక్క, తూడు, నాచు పెరుకుపోతున్నాయని, దీంతో నీటి ప్రవాహనికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాలువకు నీటి సరఫరా ఆపి చేపడుతున్న మరమ్మతులు ఖరీఫ్ సీజన్‌కు ముందుగా చేపడితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వాపోతున్నారు. మరమ్మతులు, నిర్వహణ సరిగ్గా లేకపోవటంతో కాలువ గుర్రపు డెక్కతో పూడుకుపోవటం, గట్లు బలహీనంగా ఉండటంతో పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు నీళ్లు విడుదల చేస్తే గండి పడే ప్రమాదం కూడా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



సాగునీరు లేక వెలవెలబోతున్న కాకులపాడు చానల్

ఒకటి, రెండు రోజుల్లో సాగునీరు..

కాలువ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన వేగంగా నిర్వహిస్తున్నాం. ఇప్పటికే పనులు దాదాపుగా పూర్తయ్యాయి. శరవేగంగా మరమ్మతులు ముగించి సాగునీరు విడుల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఒకటి, రెండు రోజుల్లో బాపులపాడు మండలానికి సాగునీరు చేరుతుంది.

– కొడాలి బాబు, డీఈ, కేఈ కెనాల్

అధ్వానంగా కాలువల నిర్వహణ..



కృష్ణా – ఏలూరు కాలువతో పాటుగా కాకులపాడు చానల్ కాలువ నిర్వహణ అధ్వానంగా ఉంది. కాలువ పూర్తి సామర్థ్యం మేరకు నీటి ప్రవహం రావటం లేదు. అంతేకాక ఏలూరు కాలువ ఆయకట్టుకు 1,200 క్యూసెక్కుల నీటి ప్రవహాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కేవలం 600 క్యూసెక్కుల నీటి ప్రవాహన్ని మాత్రమే విడుదల చేస్తున్నారు. దీంతో నీటి మట్టం తక్కువగా ఉండటం వల్ల ఉప కాలువలకు ప్రధాన కాలువ నుంచి నీరు అందటం లేదు. దీంతో ఆయిల్ ఇంజిన్ల ద్వారా కాలువల నుంచి నీళ్లు తోడుకోవాల్సి వస్తుంది.

– పడకల శ్రీనివాసరావు, రైతు, కాకులపాడు

నీరందక ఇబ్బందులు..



మరమ్మతులు పట్టించుకోకపోవటంతో కాలువల నిండా గుర్రపు డెక్క, తూడు, నాచు పేరుకుపోతున్నాయి. వరినాట్లు ఊపందుకున్న తరుణంలో ఏలూరు కాలువకు సాగునీరు నిలిపివేయటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సాగునీటి సరఫరా ఆపేసి మరమ్మతులు నిర్వహించటం విడ్డూరంగా ఉంది. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే కాలువల మరమ్మతులు చేపట్టాలి.

– యండ్రాపు సత్యనారాయణ, రైతు, దంటగుంట్ల

బాధ్యతలు స్వీకరించిన సీఐలు



పెనమలూరు: పెనమలూరు సీఐగా జామి వెంకటరమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు రేంజ్ నుంచి పెనమలూరుకు బదిలీపై వచ్చారు. ఆయన గతంలో పెనమలూరు ఎస్ఐగా ఇక్కడ విధులు నిర్వహించారు. గత సీఐ టీవీవీ రామారావు వెంకటరమణకు బాధ్యతలు అప్పగించారు. టీవీవీ రామారావు ఉయ్యూరుకు బదిలీ అయ్యారు.

ఉయ్యూరు సీఐగా టీవీవీ రామారావు



ఉయ్యూరు: ఉయ్యూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టీవీవీ రామారావు బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం విధుల్లో చేరారు. పూర్వ సీఐ హబీబ్‌బాషా నుంచి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతానన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా, సత్వర న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజాజీవనం సాగేలా చర్యలు చేపడతామన్నారు. ప్రజలు వివాదాలకు పోకుండా సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సీఐ సూచించారు.

నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెనమలూరు: కృష్ణా నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణానది దిగువ ప్రాంతానికి వరద నీరు విడుదల చేయటంతో నదిలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. నదీ పరీవాహక ప్రజలతో ప్రజలతో పశువుల కాపరులు, లంక భూముల్లోకి వెళ్లే రైతులు కూడా జాగ్రత్తలు వహించాలన్నారు. అత్యవసర సహాయం కోసం 1077, 112 టోల్ ఫ్రీ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మద్దూరు ఏటిపాయకు వరద నీరు

కంకిపాడు: ప్రకాశం బ్యారేజీకి వరద నీటి రాకతో అధికారులు ఏటిపాయలకు నీటిని విడుదల చేశారు. దీంతో కృష్ణానది ఏటిపాయలు వరద నీటితో ప్రవహిస్తున్నాయి. బుధవారం 1.37 లక్షల క్యూసెక్కుల నీటిని బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేయటంతో కంకిపాడు మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం వెంబడి ప్రవహిస్తున్న ఏటిపాయకు వరద నీరు వచ్చి చేరింది. ఇప్పటికే ఏటిపాయ ఒడ్డును తాకుతూ వరద నీరు సముద్రం వైపు పరుగులు పెడుతోంది.

నీటి ముంపునకు గురైన రహదారి..

ఏటిపాయకు వరద నీరు వచ్చి చేరటంతో మద్దూరు సమీపంలో కరకట్ట నుంచి ఏటిపాయలోకి వెళ్లే రహదారి మార్గం పూర్తిగా నీటి ముంపునకు గురైంది. దీంతో ఏటిపాయ లోపల ఉన్న లంక భూములకు రాకపోకలు స్తంభించాయి. అంతేకాకుండా ఏటిపాయ నుంచి అవతలివైపున గుంటూరు జిల్లా పరిధిలోని గొడవర్రు, వల్లభాపురం, కొల్లిపర మొదలైన గ్రామాలకు వెళ్లే రైతులు, కూలీల రాకపోకలు నిలిచిపోయాయి.



మద్దూరు వద్ద ఏటిపాయలో ప్రవహిస్తున్న వరద నీరు

మైక్ ద్వారా ప్రచారం..

వరద నీటి ప్రవాహం కారణంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. ఏటిపాయ లోపల చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు, మేతకు పశువులు, జీవాలను తోలుకువెళ్లిన పెంపకందారులను హుటాహుటిన గ్రామాలకు తరలించారు. ఏటిపాయలోకి రైతులు, కూలీలు, పశువులు, గొర్రెల కాపరులు వెళ్లకుండా మైక్ ద్వారా ప్రచారం చేశారు. హెచ్చరిక చేస్తూ ఏటిపాయ ఒడ్డున బ్యానర్లు ఏర్పాటుచేశారు. రెవెన్యూ సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. కాసరనేనివారిపాలెం వద్ద ఏటిపాయ ఒడ్డున ఉన్న శివాలయం వద్దకు వరద నీరు చేరింది. వరద నీరు మరింత పెరిగితే ఆలయం ముంపు బారిన పడుతుంది. వరద పరిస్థితిని తహసీల్దార్ వి.భావన్నారాయణ పర్యవేక్షించారు. మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల్లో పర్యటించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా గస్తీ నిర్వహించాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.



కాసరనేనివారిపాలెం వద్ద వరదనీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భావన్నారాయణ

ఘనంగా జెడ్పీ ఉన్నత పాఠశాల రజతోత్సవం

రామవరప్పాడు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని దానికి అనుగుణంగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రజతోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రావు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా విద్యనభ్యసించి ఉత్తీర్ణత సాధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలకు తోడు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోపరుచుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గతేడాది టెన్త్‌లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థి ఎస్.వెంకటేష్‌కు రూ.5 వేల నగదు బహుమతిని అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెయిన్ క్యాంపస్ భవన నిర్మాణానికి దాతలు పెనుమత్స శ్రీనివాసరాజు రూ.10 లక్షలు, తెంపల్లి సుబ్రహ్మణ్యం రూ.15 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణరాజు, సర్పంచ్ వరి శ్రీదేవి, ఎంఈఓ వెంకటరత్నం, మాజీ ఉప సర్పంచ్ కొల్లా ఆనందకుమార్, హెచ్‌ఎం తాయారు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఘనంగా సామూహిక సీమంతాలు

రామవరప్పాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలసంజీవని, గుడ్లు, పాలు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



కె.వి.రావుకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తదితరులు

పెనమలూరు: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కె.వియన్నారావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్(డీమ్డ్‌టుబి యూనివర్సిటీ) కళాశాలలో ఎంబీఏ విభాగం 2024–26 విద్యా సంవత్సరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధార్థ యూనివర్సిటీ అయిన తరువాత ఎంబీఏ విభాగం ఏర్పాటుచేసి మరింత నాణ్యమైన విద్య అందించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని సమాజంలో రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్న ప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలను యూనివర్సిటీగా యాజమాన్యం మార్చి విద్యా ప్రమాణాలను పెంచి విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయటమే లక్ష్యంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కేఆర్కే మూర్తి, బెటర్‌కాస్టింగ్ సీఈఓ ఏఎస్‌ఆర్‌కే ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ కె.రఘువీర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయంలో క్రీడా పోటీల కోలాహలం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో క్లస్టర్ లెవల్ ఫీల్డ్ గేమ్స్ బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఆటల పోటీలకు పలు జిల్లాల నుంచి తరలివచ్చిన నవోదయ విద్యాలయ క్రీడాకరులతో కోలాహలంగా మారింది. స్థల దాత దోనవల్లి రామారావు, మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. తొమ్మిది జిల్లాల నుంచి వచ్చిన నవోదయ జట్ల మధ్య తొలి రోజు యోగా, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి.

నీట మునిగిన పోరంకి - నిడమానూరు రోడ్డు

పెనమలూరు: పోరంకి–నిడమానూరు రోడ్డు నీట మునిగింది. గ్రామంలో బుధవారం కురిసిన వర్షానికి డ్రెయినేజీ నీరు రోడ్డుపై పెద్ద ఎత్తున చేరటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కనీసం నడవటానికి కూడా వీలు లేకుండా మారింది. పోరంకి – నిడమానూరు రోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బీజేఆర్ నగర్ రోడ్డు వరకు రోడ్డుపై నీరు నిల్వ ఉంది. జెడ్పీ పాఠశాలలోకి నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. సమస్యపై స్థానికులు మున్సిపాలిటీకి పలు మార్లు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదు. వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కంకిపాడులో కుండపోత వర్షం

కంకిపాడు: అల్పపీడన ప్రభావంతో మండలం వ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకూ కుండ పోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు స్వల్ప గాలులు వీచాయి. ఎడతెరిపి లేకుండా పడ్డ వర్షానికి పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. ప్రధానంగా ఈడుపుగల్లు, వేల్పూరు, ప్రొద్దుటూరు, గొడవర్రు గ్రామాల్లోని జగనన్న లే అవుట్లలో రహదారులు వర్షంనీటితో నిండిపోయాయి. రాకపోకలకు అసౌకర్యంగా మారింది. కంకిపాడు పట్టణంలోని బస్టాండు, రైతుబజారు ప్రాంగణాల్లో వర్షంనీరు చేరికతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీనికి తోడు అరటి, పసుపు మొక్కతోటల్లో వర్షంనీరు నిలిచిపోవటంతో దుంప దెబ్బతిని దుంప కుళ్లు వ్యాప్తి చెందుతుందనే ఆందోళనలో రైతులు ఉన్నారు. పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు.



పోరంకి జెడ్పీ హైస్కూల్ వద్ద వర్షం నీటిలో వాహనదారుల ఇక్కట్లు

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ పోషకాలు



తాడిగడపలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పొట్టిపాడులో మాట్లాడుతున్న ఎంపీపీ సరోజిని

ఉంగుటూరు: తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి సంపూర్ణ పోషకాలు అందుతాయని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. పొట్టిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బిడ్డలకు తల్లిపాలను పట్టించడం వలన రోగనిరోధక శక్తిని పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మాదేవి చెప్పారు. గ్రామ సర్పంచ్ కత్తుల జ్యోతి, ఏఎన్ఎం, అంగన్ వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే ఆరోగ్యం

పెనమలూరు: తల్లిపాలు పిల్లలకు అందించటం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీలలిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తాడిగడప గ్రామంలో బుధవారం తల్లులతో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జిన్ని విక్టర్, ఎంఎల్‌హెచ్‌పీ అంజలి, అంగన్‌వాడీ కార్యకర్తలు కనకదుర్గ, శివ, రత్న, ఆశా వర్కర్లు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.



పునాదిపాడులో తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామణి

తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి రక్ష

కంకిపాడు: తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. మండలంలోని పునాదిపాడు–1 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను సూపర్‌వైజర్ అన్నామణి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.కల్యాణి, షేక్ మీరాబి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు.

చినుకుపడితే జంక్షన్ బస్టాండ్ చిత్తడే !



బురదమయంగా మారిన కొత్త బస్టాండ్ ప్రాంగణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూతనంగా నిర్మించిన హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారుతుంది. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ ఫ్లాట్‌ఫామ్‌లు, బస్సులు తిరిగే ప్రాంతంలో బురదగా ఉండటంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు ఎక్కేందుకు, దిగేందుకు బురదలో నడవాల్సి రావటంతో వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు నానా పాట్లు పడుతున్నారు. కొత్తగా నిర్మించిన బస్‌స్టేషన్ ప్రాంగణం సీసీ కాంక్రీట్ చేయకుండా గ్రావెల్ పోసి వదిలేయటంతో ఈ దుస్థితి ఏర్పడింది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.